**భావాలు ఎంత విప్లవాత్మకమైనా, చేతలు సంప్రదాయబద్ధాలు కావడం నేటి రివాజు. సమాజానికి ఎదురునిలిచే ధైర్యం, శక్తి భారత స్త్రీకి లేదు. సమాజానికి తలవొగ్గినవారు చరిత్రహీనులవుతారు. సమాజానికి ఎదురునిలిచిన వారు ఎప్పటికప్పుడు శేషప్రశ్నలుగా నిలిచిపోతారు. వారిని వారే క్షమించుకోవాలిగాని, సమాజం వారిని క్షమించడానికి సిద్ధపడదు.**

"కాస్త ఈ బాగ్ను ఎక్కడేనా ఖాళీ స్థలం చూసి పెట్టండి." రైలాగిందో లేదో కిటికీగుండా బాగందించాడో వ్యక్తి. ఎక్కడో ఎందుకు? నా పక్కనే కూర్చుంటాడు. కాలక్షేపం కూడా అవుతుందనుకుని నా పక్కనే ఉంచాను బాగ్ను.

"కాస్త ఈ అబ్బాయిని కూడా అందుకోండి. ప్లీజ్!" కిటికీగుండానే ఓ ఏడాది పిల్లవాడిని కూడా అందించాడు. 'కుటుంబరావులా ఉన్నాడు, స్థలం లేదు గదా' అనుకుంటూ కిటికీగుండా చూస్తే నా కాయన కనిపించలేదు. సామాను లెక్కించబోయాడనుకుని సర్దుకున్నాను.

జనం విరగబడి పెట్టెలో కెక్కుతున్నారు. నాలుగు నిముషాల్లో పెట్టెనిండా అగ్గిపుల్లలవలె జనం. ఎర్రగా బొద్దుగా ఉన్న ఆ కుర్రాడు తల్లి పోలిక కావచ్చు. వాడి ముఖంలో వాడి తల్లిని చూడడానికి ప్రయత్నించి వెంటనే సిగ్గుపడ్డాను. గార్డు విజిలూదాడు. రైలు మెల్లిగా కదిలింది. నాకు గాబరావేసింది. వీడి తలిదండ్రులు రైలెక్కకపోతేనో? లేకుంటే వీడిని వదిలించుకోవడానికా పెద్దమనిషి ఈ ఎత్తు వేస్తే? ఆలోచనలతో సతమతమవుతున్న నా మనస్సు వెంటనే స్థిమితపడింది. మనుష్యులని తోసుకుంటూ వచ్చే ఓ యువతిని చూసి కుర్రాడు కేరింతలు కొట్టాడు.

నా చేతినుండి పిల్లవాడిని తీసుకుని, బాగ్ను సీటు కింద సర్ది ఆమె కూర్చుంది. ఎప్పుడూ ఆడవాళ్లతో కలిసి కూర్చుండని నేను కాస్త ఇబ్బందిపడ్డాను. కిటికీవైపు ఒదిగి కూర్చుండి చాలాసేపు పరుగెత్తే వాతావరణాన్ని చూశాను. ఎంతసేపని అలా ఉండగలను? తలను లోపలికి తిప్పి చూశాను. నలుగురి సీట్లో ఆరుగురం. ఆమె భుజం నా భుజానికి రాసుకుంటూంది. మనసులో ముళ్లకంప. వెంటనే నా బలహీనతమీద అసహ్యం.

బాగ్నుండి మల్లెపూల చెండు తీసి కుర్రాడి తలలో అమరుస్తూ "ఎక్కడివరకు పోతున్నారండి" అంది. నాకున్న దురలవాటు వల్ల రూపానికి తగిన కంఠం అనుకోవడంలో సమాధానమివ్వలేదు.

"మిమ్మల్నేనండీ." నవ్వునాపుకుంటూ అడిగింది మళ్లీ.

"మాచర్ల వరకండీ." నెమ్మదిగా చెప్పిన నా సమాధానం విని నన్ను పరీక్షగా చూసింది. నే నామె ముఖంలో చూడలేక తల వంచుకున్నాను.

"బంధువుల దగ్గరకా?"

## తిరుపతయ్య

"లేదండీ, అక్కడినుండి నాగార్జునసాగర్ పోవాలి."

"ఏం చేస్తుంటారక్కడ?"

"ఊరికే చూడడానికి పోతున్నానండీ." నేను తల వంచుకునే సమాధానం చెపుతున్నా ఆమె నా ముఖంలోకే చూస్తున్న విషయం నాకు తెలుసు.

"ఎక్కడినుండి వస్తున్నారు?" తల పైకెత్తాను.

"వరంగల్ నుండి." నా వివరాలడిగేవాళ్లంటే నాకు భయం, అసహ్యం కూడా. కాని ఆమె ప్రశ్న నాకు భయాన్నికాని, అసహ్యాన్ని కాని తెప్పించలేదు. కారణం నా కామె ఆత్మీయురాలిగా కనిపించింది.

"వరంగల్లో ఏ ఉద్యోగం చేస్తున్నారు?" నాకు చాలా సిగ్గు కలిగింది. నా ఆకారం వయసుకుమించి ఉంటుంది. మా ఊళ్లో, ఎంతకాలం చదువుతావు? ఏ ఉద్యోగం దొరుకుతుంది? జీత మెంతుంటుంది? మొదలైన వివరాలడిగేవాళ్లంటే నాకు భయం. ఆమె కూడా అడుగదు కదా అనుకుంటూనే మెల్లిగా సమాధానం చెప్పాను.

"ఇంకా చదువుకుంటున్నానండీ."

"ఏం చదువుతున్నారు?"

"బి. ఎ. అయిపోయింది. ఎం. ఏ. కి అప్లై చేశాను." ఇన్ని వివరాలడిగినా గంగిరెద్దులా సమాధానం చెపుతున్నాను కాని ఎందుకని ప్రశ్నించలేకపోయాను. అలా అడిగే ధైర్యం కూడా నాకు లేదు. రైలు వేగంగా పోతూంది. ఆమె చూపులో ఎందుకంత ఆకర్షణ? ఆమె ఉబుసుపోక అడిగినట్లుగా కూడా కనిపించదే! నేను వినయంగా ఎందుకు సమాధానం చెప్పాలి? ఈ ప్రశ్నలు నన్ను వేధించసాగాయి.

ఒక్కొక్కరిని చూడగానే ఒక్కో అభిప్రాయమేర్పడుతుంది. మొదటి చూపులోనే కొందరిని మనం ద్వేషిస్తాము. ఆ వ్యక్తి మన కేమీ అపకారం చేయకపోవచ్చు. మరికొందరిని మొదటి చూపులోనే ప్రేమిస్తాము. మనలాంటి వ్యక్తి అనుకుంటాము. దాన్ని పూర్వజన్మ సంస్కారమంటారో ఏమంటారో కాని నా కామె ఆత్మీయురాలిగా కనిపించింది. ఆ తరవాత చాలాసేపటివర కెవరూ మాటాడలేదు. నేనే అడిగాను నెమ్మదిగా.

"మీ రెక్కడివరకు పోవాలి?"

"గురజాలవరకు. మీరు గురజాల దాటి పోవాలి."

"అది మీ పుట్టిల్లా లేక?..."

"మావారి కక్కడ ఉద్యోగం."

"సీటు దొరకనట్టుంది. ఇటు రమ్మనకూడదూ వారిని."

"నన్ను రైలెక్కించింది మా అన్నయ్య. వాడు రావడం లేదు."

"అలాగా? నేను పొరపడ్డాను. మీ రొక్కరే ప్రయాణం చేస్తున్నారన్నమాట." కొంచెం ఆశ్చర్యంగానే అడిగాను.

"వాడు స్వయంగా పంపించిరావాలనే వచ్చాడు. నేనే తిప్పి పంపించాను. అయినా స్త్రీకి పుట్టిల్లూ అత్తిల్లూ తప్ప మరో చోటు ఉంటుందా? ఉన్నా అక్కడ గౌరవింపబడుతుందా?" ఈ మాట లామె నవ్వుతూనే అన్నా, ఆ నవ్వు వెనక నీలినీడలున్నాయి.

ఏదో స్టేషన్లో రైలాగింది. చాలామంది దిగిపోయారు. పండ్లవాడి కేక విన్న కుర్రాడు నా మీదకు వచ్చి పండ్లవైపు చేయి చూపించాడు. ఓ మామిడి పండూ, రెండు సపోటాలూ కొన్నాను.

"వాడి కెందుకండీ? గుడ్డలు పాడుచేస్తాడు."

"పరవాలేదండీ" అంటూ వాడు అతి ప్రయాసతో తినడాన్ని చూస్తూ ఉన్నాను. ఇద్దరు వృద్ధ దంపతులు మా ముందుకు వచ్చి కూర్చున్నారు. నిండు ముత్తైదువులా ఆమె నుదుటి మీద పెద్ద బొట్టు. రైలు మెల్లిగా కదిలి వేగం హెచ్చించింది.

"అబ్బాయిది అచ్చు తల్లిపోలికే. అదృష్టవంతుడు నాయనా. మీ ఇద్దరి ఈడూ జోడూ చూస్తుంటే ముచ్చటగా ఉంది. ఎక్కడివరకు పోవాలి, బాబూ!" ముసలావిడ మాటలు విని నా గుండెలు ఝల్లుమన్నాయి. శరీరంనిండా జెర్రులు పాకినట్లనిపించింది. చాచి ఆమె చెంప పగిలేటట్లు వేయాలనిపించింది. నేను కుర్రాడిని ఒడిలో ఉంచుకోవడంవల్లే ఈ ప్రమాదం వచ్చిపడింది. ఆమె అభిప్రాయాన్ని మార్చాలని నేను నోరు విప్పానో లేదో, "గురజాలవరకండీ. మీరెక్కడి వరకూ?" అని ఆమె ముసలావిడకి సమాధానం చెప్పి మాటల్లో మునిగిపోయింది. నా ఆశ్చర్యానికి అంతులేదు. ఆలోచనలు తెంపులేకుండా వస్తున్నాయి. కళ్లప్పగించి ఆమెనే చూస్తుండిపోయాను. ముసలావిడ కాసేపటికి పక్కనున్న వాళ్లతో కబుర్లలో పడిపోయింది. సిగ్గుతో నాకు మాట రావడం లేదు.

"మీ పేరు?" ఆమె నావైపు తిరిగి గట్టిగా అడిగింది.

"ఆనందరావు."

"బాగుంది పేరు." చిన్నగా నవ్వింది. స్వచ్ఛంగా నవ్వింది. స్నేహ పరిమళాలు గుబాళించేలా నవ్వింది. ఆ నవ్వుని చూసి నేను ముగ్ధుణ్ణై అయిపోయి మెల్లిగా అడిగాను.

"మీ పేరు."

"కమల." మంచి పేరు. శేష ప్రశ్న చదివిన తరవాత ఆ పేరంటే నాకు ప్రాణం. ఆ పాత్రనూ, సృష్టికర్తనూ గురించి ఆలోచిస్తూ సర్వం మరిచిపోయాను.

"ఏమి టాలోచిస్తున్నారు?"

"మీ పేరు వినగానే శేషప్రశ్నలోని కమల గుర్తుకు వచ్చింది. ఆ పాత్ర అంటే నాకు చాలా ఇష్టం."

"ఎందుకు? విప్లవాత్మక భావాలతో సమాజాన్ని తృణీకరించినందుకా?"

"మీరూ చదివారన్న మాట. అంతేకాదు, మానసికంగా, శారీరకంగా ఒకే స్వభావం కలిగి, సమాజపు కుళ్లును బయటపెట్టి, కుంటి, గ్రుడ్డి, గూని, చెవుడు అయిన సమాజపు విమర్శను ధైర్యంగా ఎదుర్కొని, ఆ అవకతవక సమాజం కన్న తాను చాలా నయమని నిర్ణయించుకున్నందుకు." ఆవేశంతో ఇంకా చెప్పబోయాను. కాని ఆమె ముఖం చూడగానే మాట లాగిపోయాయి. గంభీరమైన చూపులతో గంభీరమైన రూపం.

"కమలను విమర్శించే శక్తి నాకు లేదు. కాని వాస్తవలోకంలో కమల ఎంతవరకు నిలబడగలుగుతుందీ అన్నది సందేహం. ఈ పవిత్ర భారతదేశంలో కమల లాంటివా రెంతమంది ఉంటారు?" నన్నే చూస్తూ అడిగింది.

"ఎంతోమంది ఉండవలసిన పనిలేదు. అలాంటి ధైర్యం అలవరుచుకోవాలని శరత్‌బాబు అభిప్రాయం.



అతని అన్ని స్త్రీపాత్రలకి మల్లే బాధపడడం నేర్చుకున్నా, నా వలె పరిస్థితులకు తల ఒగ్గక సమాజాని కెప్పటి కప్పటి కొత్త [illegible] నిలిచింది కమల. ఆ పాత్రను చదివి నేనెంతో [illegible] మారవచ్చు! శరత్ కోరిందికూడా అదేనేమో." ఆమె చిన్నగా నవ్వింది. కాని నా మాటలతో ఏకీభవించినట్లు కనిపించలేదు.

"నా కెక్కువగా తెలియదు కాని, కోరుకున్నంత మాత్రాన మారగలిగితే ఈ దేశంలో అబలల సంఖ్య తగ్గిపోదూ?," మళ్ళీ నవ్వింది. ఆ నవ్వువెనక అస్పష్టంగా మంచు తెరలు. నా కింకా వాదించా లనిపించలేదు.

నా ఒడిలో నిద్రపోతున్న అబ్బాయిని తీసుకుని [illegible] ట్రైనింకో స్టేషన్లో ఆగి మళ్ళీ ప్రయాణిస్తోంది.



ఆలోచనలనుండి తేరుకున్నదానిలా నా వైపు చూసి అడిగింది.

"మీకు పెళ్ళి అయిందా?"

"ఇంకా కాలేదు. ఇప్పుడప్పుడే చేసుకోవాలని లేదు కూడా."

"ఎందుచేత?"

"నా కిష్టమైన అమ్మాయి దొరకద్దూ మరి?"

"ఎలాంటి అమ్మాయి కావాలి మీకు?"

"నిజం చెప్పనా — మీలాంటి అందమూ, గుణమూ, అదృష్టమూ ఉన్న అమ్మాయి. అంటే కమల లాంటి అమ్మాయి," ఈ మాట విని నవ్వుతుం దనుకున్నాను. కాని ఆమె ముఖం వివర్ణమైంది. కంగారుగా అంది.

"మిమ్మల్ని చేసుకునే అదృష్టమే చాలు. అంతే, ...దే చాలు."

...కుంది. నా మ...
అనిపించింది.

"మన్నించ...

"అబ్బే! ...

...రి అదృష్టం...
...టికి సమర్థ...
...ని సామర్థ్య...
చేయలేదు.



# వెలగని దీపం

...వాత ముఖం అటువైపు తిప్పు ...ల్ల ఆమెకు బాధ కలిగించానేమో

...మమ్మల్ని గాయపరిచినట్లున్నాను."

...ా బాధించలేదు. అయినా ఒక్కొ ...రకంగా ఉంటుంది. నమ్మని వాళ్ళ ...మవర్తిత అని పేర్లు పెడతారు. ...ఒక్కొక్క సమయంలో ఏమీ ...ా మాట్లాడుతున్నాను. ఏమీ

అనుకోకండి. నాగార్జునసాగర్‌లో ఎన్నాళ్ళుంటారు?"


"రేపొక్కరోజే ఉండి తిరిగి వస్తాము."

"అయితే వచ్చేప్పుడు గురజాలలో దిగండి. పోస్టాఫీసు పక్కనే మా ఇల్లు. అయినా ప్రయాసకదూ?" అంటూ నవ్వింది. కాని ఆ నవ్వులో జీవం లేదు. ఆమె నిజమైన నవ్వును ఒక్కసారే చూడగలిగాను. ఇంత సేపు మాట్లాడినా నా కామె అర్థంకాని సమస్యలాగే ఉండిపోయింది. రైలింకో స్టేషన్‌లో ఆగి ప్రయాణిస్తోంది.

"వచ్చే స్టేషన్‌లో దిగిపోతాను. మీరింకా ముందుకు పోవాలి. మనం మళ్ళీ కలుసుకోకపోవచ్చు. కాని మీ పరిచయం నా కెప్పుడూ జ్ఞాపకముంటుంది." ఆమె కండ్లు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి.

"ఎందుకు కలుసుకోలేము? వచ్చేప్పుడు గురజాలలో దిగుతానుగా." నా మాట విని ఆమె కంగారుగా తల ఎత్తింది.

"నే మాటకే అన్నాను. నిజంగా అన్నా మీరు వస్తారా ఏమిటి?" అంటూ తల వంచుకుని కన్నీళ్ళ




చిత్రం—కె. ఎస్. రెడ్డి (హైదరాబాదు)

తుడుచుకుంది. ఆమెను గుండెలకు హత్తుకుని ఓదార్చాలనిపించింది. నా కళ్ళకూడా నిండాయి. అతి ప్రయత్నంతో దుఃఖాన్ని ఆపుకున్నాను. గురజాల స్టేషన్‌ను రైలు భారంగా విడిచింది.

"ముక్కూ ముఖమూ తెలియని బాటసారులు కలుసుకున్నారు. ఒకరి నొకరు తెలుసుకున్నారు. మార్గాయాసం పంచుకున్నారు. జ్ఞాపకాలను పట్టుకుని ఎవరి తోవను వారు పోయారు. మళ్ళీ కలుసుకునేది నమ్మకంలేదు." దీనిలోని పరమార్థం చెప్పండిరా అనే వాడు మాస్టారు. ఆ రోజుల్లో పరమార్థమేమిటి? ఊక అనుకునేవాడిని. ఈ రోజు అర్థం తెలిసింది. అయినా బాటసారి ప్రయాణించాలి కదా మరి!

నాగార్జునసాగర్‌లో ఓరోజుండి కృష్ణమ్మ పొంగునూ, పొంగు నరికడుతున్న మానవుని శక్తినీ, ప్రాచీనుడి కళాపిపాసనూ, నాగరికతనూ, వైభవాన్నీ కనులారా చూచి ఆనందించాను.

మాచర్లలో టికెట్ విజయవాడకు తీసుకోవాలా, గురజాలకా? అని అనుమానం వచ్చింది. ఆమె మాటవరసకు రమ్మంటే పోవడమే! ఎదటి వారికి మన హృదయంలో ఎంత స్థానం ఉందో, అంతే స్థానాన్ని వారి హృదయంలో పొందాలనుంటుంది. లేకుంటే బాధపడతాము. నేను పెంచుకున్న మమకారాన్ని ఆమె పెంచుకోకపోతే? అక్కడికి పోయి బాధపడడమే ఔతుంది. టిక్కట్టు విజయవాడవరకే తీసుకున్నాను.

రైలు పట్టాలమీద శబ్దం నా గుండె చప్పుడులా ఉంది. గురజాల దగ్గిరపడుతున్నకొద్దీ మనస్సు అదుపులో లేదు. ఒక్కసారి ఆమెను చూస్తే! ఒక్కసారి ఆమె సౌభాగ్యాన్ని కనులార చూచిపోతే! మళ్ళీ ఈ ప్రాంతాని కెందుకు వస్తాను? ఇదే ఆలోచన. నాకు తెలియకుండానే సూటుకేసు పట్టుకుని గురజాలలో దిగాను. పోవాలా వద్దా అని రైలు వెళ్ళిపోయేదాకా ఆలోచించాను. మళ్ళీ రేపు ఉదయం ఉంది బండి.

ఇల్లు దొరకడాని కంత కష్టం కాలేదు. సందేహిస్తూనే గుమ్మం ఎక్కి తలుపు తట్టాను. తలుపు తెరుచుకున్నాక పరిస్థితి నెదుర్కోగలనా అనిపించింది. నన్ను కపీసం స్నేహితుడుగా గాక ఇదెక్కడి కర్మరా అనుకుంటే? వెనక్కి తిరిగి ఒక మెట్టు దిగాను.

"ఎవరూ?" తలుపు తెరుచుకుంది. ఆమే! నా గుండెల నిండా అమరాగపు పరిమళాలు. తోబుట్టువులుండే అదృష్టానికి నేను నోచుకోలేదు. కాని ఆమె స్థాణువులా నిలబడి నన్ను చూసేసరికి నా అభిమానం దెబ్బతిన్నది. తల కిందకు వాల్చుకున్నాను.

"లోపలికి రండి." ఆమెతో మంత్రముగ్ధుడిలా నడిచాను. కుర్చీ చూపిస్తే కూర్చున్నాను. ఆమె రాని నవ్వు తెచ్చుకుంది. ఆమె నిజమైన నవ్వు నాకు తెలుసు.

"మీరు నిజంగానే వచ్చారే! మా వారు వచ్చే టైమయింది. ప్రయాణం కులాసాగా జరిగిందా?" నేనేమీ మాటాడలేదు.

"పేపరు చూస్తూండండి. కాఫీకి నీళ్ళు పెడతాను" అంటూ లోనికి పోయింది. నేను రావడం అవివేకం అనిపించింది. నన్ను నేను నిందించుకున్నాను. మంచంలో కుర్రవాడు నిద్రపోతున్నాడు. నే నూహించుకున్న కళాకాంతులా ఇంట్లో లేవు. నా అహం పూర్తిగా దెబ్బతిన్నది. ఈ చొరవ తీసుకున్నందుకు నాకు నేనే అల్పుడుగా కనిపించాను. ఆమె రాకముందే వెళ్ళిపోయి, ఏదో హొటల్లో గడపాలనిపించింది. వెంటనే సూటుకేసు పట్టుకుని బయటకు వచ్చి మెట్లు దిగుతున్నాను.

"ఎవరు కావాలండీ!" ఓ వ్యక్తి నన్ను నిశితంగా చూస్తూ అడిగాడు. నలభై ఏళ్ళపైన ఉంటాయతనికి. బట్టతల. కళ్ళజోడుగుండ కనుగొను లెస్సి అతడు నన్ను చూసే విధానం నాకు నోట మాట రాకుండా చేసింది.

"ఎవరికోసం వచ్చారు? ఎక్కడినుండి?" అతడు మళ్ళీ ప్రశ్నించాడు. చెప్పక తప్పలేదు.

"ఈ ఇంట్లో కమలగారిని చూసిపోదామని వచ్చానండీ!"

"ఎప్పుడు వచ్చారు?"

"ఇప్పుడే — కాని మళ్ళీ వద్దామని ..."

"పరవాలేదు. రండి. నేనె కమల భర్తను." నా చుట్టూ ఉన్న లోకం గిర్రున తిరిగింది. నా కింద భూమి కదిలిపోతూంది. అతడు కమల భర్త? ఊహించడానికి కూడా వీలులేదు. అతని వెనకే నడిచాను.

"కమలా! నీకోసం ఎవరో వచ్చారు. కాస్త బయటికి వచ్చి ..." మాట పూర్తి కాకుండానే కమల రెండు కప్పులతో వచ్చింది. సూటుకేసు పట్టుకుని నుంచున్న నన్ను చూసి ఆమె ముఖం పాలిపోయింది. నేను నేరం చేసినవాడిలా తల వంచుకున్నాను.

"ఓహో! కలుసుకున్నారన్నమాట" అంటూ కాఫీ కప్పు అందుకున్నాడు. కాఫీ తాగాక "నాకు కాస్త పనుంది. మాట్లాడుకుంటూఉండండి" అంటూ పక్క గదిలోనికి వెళ్ళాడాయన.

'చూశావుగా నా సామ్రాజ్యాన్ని' అన్నట్టున్నాయి కమల చూపులు. నా తలంతా ఆలోచనలతో బరువెక్కిపోయింది. అట్లానే కమలను చూస్తూ ఉన్నాను.

"క్షమించండి. అరగంటలో వంట పూర్తిచేస్తాను"

(తరువాయి 41 వ పేజీలో)

(39 వ పేజి తరువాయి)

అంటూ లోపలికి పోయింది. నాకా ఇంట్లో ఏదో విషపు కుండ ఉన్నట్లనిపించింది. విచారంగా కూర్చుని కాసేపు పేపరు తిరగేశాను. పిల్లవాడు లేస్తే కాసేపు వాడితో ఆడుకున్నాను. ఆ తరవాత కుర్చీకి తల ఆనించి కళ్ళు మూసుకున్నాను. హృదయం భారంగా ఉంది.

కాసేపటికి కమల భోజనానికి పిలిచింది. అతడు భోజనమైపోయేదాకా ఒక్క మాటకూడా మాటాడ లేదు. కమలా అంతే. నేనూ అంతే. భోజనం నాకు విషంగా కనిపించింది. భోజనమైనాక కమల నాకు ముందు రూములో మంచం వేశానని చెప్పింది. అతడు ఈసారి చెప్పకుండానే గదిలోకి పోయాడు. ప్రతి క్షణం నా అవివేకం నన్ను వెక్కిరిస్తూంది.

గంట తరవాత వచ్చిన కమల చేతిలో మంచినీళ్ల చెంబు. కన్నుల నిండా నీళ్ళు. "నన్ను మనఃస్ఫూర్తిగా క్షమించే మనసుతో ఈ రాత్రి ఇక్కడ గడపండి" అంటూ వెళ్లిపోయింది కమల. నా కేడ్పు వచ్చేసింది. ఏడుస్తూ ఆలోచనల్లోనే నిద్రపోయాను.

లోపలినుండి సన్నగా మాటలు, వెక్కిళ్ళు వినిపించి లేచాను. నా గుండెలు చాలా వేగంగా కొట్టుకుంటున్నాయి.

"మీ కాళ్లు పట్టుకుంటాను. మీ రేమన్నా అన దలుచుకుంటే రేపాయన వెళ్లిపోయాక అనండి."

"నే నేమన్నాను? ఇంత దూరం వచ్చిన వాడిని ఒంటరిగా పడుకోబెట్టడం న్యాయమా అన్నాను. అంతేగా!"

"దయచేసి ఊరుకోండి. ఆయన వింటే ఏమను కుంటాడు? రేపు నన్ను చిత్రవధ చేయండి. కాని, ఈ ఒక్కరాత్రి . . ."

"ఏమనుకుంటాడేం? దొంగ . . . అయినా వాడి కెందు కవడం? నా అనుమానం నేటితో తీరింది. నన్నింకా మోసం చేయలేవు."

"మీ మాటల కర్థంలేకుండా పోతూంది. పరిచయమ్మడిగా వచ్చినందుకు పాపం అంటగడతారా?"

"ఓహో! సిగ్గులేనిదానా! రైల్లోని పరిచయమే ఇంతదూరం లాక్కువస్తుందా! చెప్పు. ఎన్నాళ్లనుండీ పరిచయం? నన్నెందుకు పెళ్లిచేసుకున్నావు? ఈ బిడ్డ నా బిడ్డా లేక . . ." నా చెవుల్లో సీసం పోసినట్లయింది. నా హృదయం నల్లగా మాడిపోయింది. చివరకు నా రాక ఈ విధంగా ఫలించిందన్నమాట. తలను మంచంకేసి బాదుకున్నాను.

కెవ్వుమన్న కేకతో ఈ లోకంలోకి వచ్చాను. గబగబా కిటికీ దగ్గిరికి పోయి నుంచున్నాను. కమల వెంట్రుకలు అతని చేతులచుట్టూ ఉన్నాయి. ఓ చేతిలో కర్ర ఉంది. కమలను ఈడుస్తూ బాదుతున్నాడు. కమల కొంగు నోట్లో కుక్కుకుని నిశ్శబ్దంగా బాధ భరిస్తూంది. మంచంకింద కుర్రాడు ఊపిరిపట్టి ఏడుస్తున్నాడు. ఆ హృదయవిదారక దృశ్యాన్ని చూసి కాసేపు ఆత్మహత్య చేసుకోవాలనిపించింది. ఆ దుర్మార్గుడిని ముక్కముక్కలుగా నరకాలనిపించింది. కాని కండ్లకు చీకటి కమ్మి అట్లాగే కూలబడిపోయాను. చాలాసేపటికి తెలివి వచ్చింది. కాని అంతటా చీకటిలా నిశ్శబ్దం ఆవరించింది. వెంటనే వెళ్లిపోవాలనే కోరిక తప్ప నా కప్పు డే ఆలోచనా రాలేదు. వెలగని ఆ దీపాన్ని మళ్లీ చూసే శక్తి నాకు లేదు.

భారంగా స్టేషన్‌కు వచ్చాను. మూడు గంటలు దాటింది. చంద్రుడు లేని ఆకాశం చుక్కల కన్నీటితో ఏడుస్తూంది. బండి అయిదు గంటలకు. రైల్వే బెంచీ మీద కూర్చున్నాను. జేబులో డబ్బు లేదు. సూట్‌కేస్ అక్కడే ఉంది. చేతికి వాచీ ఉంది. మానవలోకాన్ని కసిదీరా తిట్టాను. ఒక అమాయకురాలి జీవితం నాశనానికి కారకుడినైనాను. వచ్చే గూడ్సు బండి కింద తల పెట్టాలనిపించింది. ఛీ! ఛీ! చావడానికీ బ్రతకడానికీ చేతకాని మనిషిని నేను.

ఆ దుర్మార్గుడు కమలను చంపేస్తే! లేకుంటే రేపు వదిలిపెడితే! కమలను సంఘం పురుగును చూసినట్లు చూస్తే! కమల ఆత్మహత్య చేసుకుంటే! ఆ కుర్రాడి భవిష్యత్తేం కావాలి? తలంతా ప్రశ్నలతో దిమ్మెక్కింది. కండ్లనుండి అవిరళంగా కన్నీరు వస్తూంది.

తూర్పున ఎరుపురేఖలు కనిపించాయి. కమల శోకం తగిలినా ఆ ఊరు మాడిపోలేదు. ఎందరు కమలలున్నా ఆ ఊరు మాడిపోదు. బండి వస్తూంది. నిర్జీవంగా లేచి నుంచున్నాను. చివరిసారిగా నన్ను నేరస్థుడిని చేసిన ఆ ఊరువైపు చూశాను. నా సూట్‌కేస్ పట్టుకుని వేగంగా వచ్చే కమల కనిపించింది. ఎదురుగా పోయి నా కన్నీటితో ఆమెను తడిపేయాలనిపించింది. ఛీ! నాకన్నా చలనం లేని రాయి నయం. కమల సూట్‌కేస్ కింద ఉంచింది. ఆమె కండ్లు నీటి బుడగల్లా ఉన్నాయి.

"ఈ బలహీనుడిని మన్నిస్తావా, కమలా?" పసి పిల్లవాడిలా ఏడుస్తూ అడిగాను.

"ఇంతదూరం వచ్చినందుకు సరియైన ఆదరణ ఇవ్వలేకపోయాను. చూశారా ఈ కమలను? నా జీవితం శేషప్రశ్నకాదూ? అయినా నా గురించి మీరు దిగులు పడకండి. నన్ను వదిలేసే ధైర్యం లేదాయనకు. వస్తాను." కమల ఈ మాటలంటూ వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయింది. మనసులో ఆమెకు నమస్కారంచేస్తూ కదిలే బండిలో ఎక్కాను. ★

